నగ్న పురుషులు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

హోటల్ నయగరా ముందు టాక్సీ ఆగింది.

టాక్సీలోంచి అతడు దిగాడు. హోల్డాల్ చేత్తో పట్టుకున్నాడు. టాక్సీని పంపేసి హోటల్ లోకి నడిచాడు. క్రాపు సర్దుకున్నాడు.

"ఏం కావాలి సార్?" అడిగాడు కౌంటర్ లోని మేనేజర్.

"రూం."

"మేనేజర్ చకచక రిజిష్టర్ తెరిచాడు. తాళం బోర్డులోంచి ఒక తాళంచెవి తీసి అందించాడు.

"రూం నెంబర్ డెబ్బయ్!" పైకి చదివాడు అతడు.

మేనేజర్ నవ్వి, రిజిష్టర్ అతడివైపు త్రిప్పాడు.

అతడు పేరు రాసి చిరునామా రాశాడు. ఊరు వచ్చిన వివరం రాసేచోట "ఆకాశవాణి కార్యక్రమం కోసం!" అని రాసి సంతకం చేశాడు.

వెయిటర్ ని పిలిచాడు మేనేజర్. అడ్వాంసు అడిగి

పుచ్చుకున్నాడు.

మూడో అంతస్తులో రూం నెంబర్ డెబ్బయ్ ముందు ఆగాడు అతడు.

తాళం తీశాక హోల్డాల్ లోపల పెట్టి వెళ్ళిపోయాడు వెయిటర్.

అతడు తాళంచెవిని బల్లమీద వుంచాడు. తలుపులు దగ్గరగా వేశాడు. బోల్టు పెట్టాడు. బద్ధకంగా వొళ్ళు విరుచుకున్నాడు.

బట్టలు విడిచి స్నానం చేశాడు. అద్దం ముందు నిలబడి గంటసేపు మేకప్ చేసుకున్నాడు. కాలింగ్ బజర్ నొక్కాడు. వెయిటర్ వచ్చాడు.

తలుపులు తెరిచి అతడు టిఫిన్‌కీ, కాఫీకీ ఆర్డరిచ్చాడు.

వెయిటర్ వెళ్ళిపోగానే, టెలిఫోన్ వున్న టీపాయ్‌ను సమీపించాడు. రిసీవర్ ఎత్తి 'సివిల్ కాల్' అన్నాడు.

అయిదు నిమిషాల్లో కనెక్షన్ లభించింది.

"హాలో....రాధా హియర్!" అందొక తియ్యటి గొంతు.

అతడు పరవశంగా చూశాడు. క్రాపు సర్దుకున్నాడు.

"రాధగారూ!" అన్నాడు అతడు.

"మీరెవరు?"

"శ్రీపతిని!"

"శ్రీపతా!"

"నాకు ఈ మధ్య కాంట్రాక్టు అందింది. మంచి పంట పండించడం ఎలా? సంభాషణకి."

"ఓహో! పల్లెసీమలు కార్యక్రమానికా?"

"అవును."

"అయితే నాకు ఎందుకు ఫోన్ చేయడం?"

"మీరు పరిచయం చేస్తే నాకూ ఇష్టం!"

"మన ఇష్టాయిష్టాలేమీ వుండవు. ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ యిష్టం!"

"మీరు చెబితే కాదనరు!"

"నేనెందుకు చెబుతాను?"

"నేను ఆసక్తి చూపుతోన్నట్టు చెప్పి ఒప్పించండి!"

"మిష్టర్! మీరు ఎవరో నాకు తెలియదు! నాకూ ఆ కార్యక్రమానికీ సంబంధం లేదు. నేను రేడియోలో కేవలం అనౌన్సర్‌ను. అంతే!"

"కావచ్చును. మీ గొంతుకూ గొంతులోని మాధుర్యానికీ నేను దాసుడిని. కేవలం ఒక అభిమానిగా కోరుతున్నాను. ప్లీజ్ ...."

"మీ వాదన విడ్డూరంగా వుంది. ఆకాశవాణి సంస్థ మీకు కాంట్రాక్టు యిచ్చింది. రికార్డింగ్ చేయించుకొని ప్రసారం చేయవలసిన బాధ్యత సంస్థదే!"

"ఒప్పుకుంటాను!"

అవతల రాధ ఫోన్ పెట్టేసినట్టు 'క్లిక్'మన్నది.

వెయిటర్ టిఫిన్ తెచ్చి, బల్లమీద పెట్టాడు.

రిసీవర్‌ను క్రెడిల్ చేసి అతడు టిఫిన్ తినడం మొదలు పెట్టాడు.

ఆటో మాట్లాడుకొని ఆకాశవాణి కేంద్రంవద్ద దిగాడు శ్రీపతి.

"ఎవరు కావాలండి?" అడిగాడు వాచ్‌మాన్.

అతడికి కాంట్రాక్టు చూపించి లోపలకు నడిచాడు.

'పల్లెసీమలు' కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అతడిని రిసీవ్ చేసుకున్నాడు.

ఇద్దరూ రికార్డింగ్ రూంలోకి నడిచారు.

"సార్! ఒక రిక్వెస్టు!" అన్నాడు అతడు.

"చెప్పండి శ్రీపతిగారూ!" తలుపు మూశాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

"నన్ను పరిచయం చేసేది ఎవరు?"

"ఏం?" అన్నాడు ఆఫీసర్ ఎవరయితే ఏం అన్నట్టు.

"రాధాదేవిగారితో పరిచయం చేయించండి!"

"ఆమె మీకు తెలుసా?"

"ఆమె గొంతు నాకు పదేళ్ళయి తెలుసు!"

"ఆమెతో పరిచయం కుదరదనుకుంటాను!"

"సారీ సర్! రాధగారు లేకపోతే నాకు ఈ పరిచయం వద్దు!"

ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ విడ్డూరంగా చూశాడు.

"మీ నిర్ణయం అదేనా?"

"ప్లీజ్.... రేపటివరకూ వెయిట్ చేస్తాను! రాధాదేవి గారిని కార్యక్రమం కోసం ఏర్పాటు చేయించండి. రిక్వెస్టు!"

తలుపు తెరుచుకున్న చప్పుడయింది.

గుమ్మంలో రాధాదేవి.

"రాధాదేవి అంటున్నారు! మీరు శ్రీపతిగారు కాదు కదా!"

శ్రీపతి మొహం వికసించింది.

"మీరు రాధగారేనా?"

"అవును బాబూ! ఈమె కోసమే మీరు కలవరించారు" అని ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, రాధవైపు తిరిగి "అమ్మా! మీరు ఈయనను పల్లెసీమలలో పరిచయం చేయగలరా?" అన్నాడు.

రాధ మొహం ఎర్రగా అయింది.

"నేను రికార్డింగ్ చేయగలను!" అంది.

ఎగ్జిక్యూటివ్ ఆమెనీ, శ్రీపతినీ మార్చి మార్చి చూశాడు. రాధ చేతిలో కాగితం పెట్టి బయటకు కదిలాడు.

2

గౌరి కూనిరాగం తీస్తూ బట్టల బీరువా దగ్గర ఆగింది. బీరువాకి అమర్చిన నిలువుటద్దంలో తనని తాను చూసుకుంది. ఆడవాళ్ళలో తాను ఎంతయిన మనిషి క్రిందే జమ!

గులాబీ రంగూ, నొక్కుల జుత్తూ, చిన్న నుదురూ, చేపలాంటి కళ్ళూ, సన్నగా పొడవుపాటి ముక్కూ, తడితో వుండే ఎర్రటి పెదిమలూ, కొనదేరిన గడ్డమూ అరటి మువ్వులాంటి కంఠమూ, చిలక పచ్చరంగు షిఫాన్ చీరలో మాచ్ అయే బ్లవుజూ, పల్చటి చీర లోంచి కనిపిస్తోన్న పొత్తడా, చీరకూ బ్లవుజుకూ మధ్య కొట్టొచ్చినట్టు కనిపించే నడుమూ, కాళ్ళకు ఎత్తు మడమల శాన్డాల్ చెప్పులూ, మెడలోంచి వ్రేలాడే ముత్యాల దండా తనని చూసి చూపు తిప్పుకోలేరు.

గౌరి గర్వంగా చూసింది.

అద్దంలో దంతపు బొమ్మలాగా మెరుస్తోంది తాను. తనకు పెళ్ళయి నాలుగేళ్ళయింది. సంసార జీవితంలో తన వొంటి జిగి పెరిగిందే తప్ప తరగలేదు. తనని ప్రేమగా చూసే భర్తా, తన వెనక లక్షల ధనమూ మంచి ఆదాయం వచ్చే ఫరం....తనకింకా ఏం కావాలి?

వాత్సవ ఊళ్ళోలేడు. విశాఖపట్నం వెళ్ళాడు. ఏదో ఫరం పనిమీద వెళ్ళాడు. ఈ రాత్రికో, రేపటికో వచ్చేస్తాడు. తనను విడిచిపెట్టి అతడు ఉండలేడు. రాత్రులయితే మరీనూ.

మెయిన్ హాలులో టెలిఫోన్ గణగణలాడింది.

గౌరి కిటికీవద్దకు నడిచింది. కిటికీలోంచి మెయిన్ హాలు కనిపిస్తోంది. పనిమనిషి టెలిఫోన్ వైపు పరుగెత్తుతోంది.

రిసీవర్ ఎత్తి, "ఎవరు కావాలండీ?" అంది పనిమనిషి.

అవతల చెప్పింది విని, గౌరి వున్న గదివైపు చూసింది.

"కనెక్షన్ యివ్వు. దిగను!" అంది గౌరి.

పనిమనిషి ఆమె గదికి ఫోన్ కనెక్షన్ యిచ్చింది. గౌరి గదిలోని ఫోన్ మ్రోగింది. గౌరి రిసీవరెత్తింది.

"హలో.... గౌరిని మాట్లాడుతున్నాను."

"గౌరీ! నేను శ్రీపతిని."

"శ్రీపతా? ఎవరు?"

"నీ కాలేజీ రోజుల్లో శ్రీపతి పేరు వినలేదా?"

"ఓ శ్రీపతా? నువ్వు....పట్నంలోనే వున్నావా?"

"ఏం? వుండకూడదా?"

"అబ్బే! వుండకూడదనికాదు. చాల కాలమైె పట్నం వదిలిపెట్టి వెళ్ళిపోయావు."

"అంటే నా గురించి దర్యాప్తు చేయించావన్నమాట!"

"దర్యాప్తా? ఎందుకు చేస్తాను?"

"నిన్ను ప్రేమించి విఫలమయాను కాబట్టి."

"ప్రేమ రెండు ప్రక్కలా వుండాలి."

"అంటే....?"

"నువ్వు ప్రేమించినంతమాత్రాన ఆ ఆడదీ నిన్ను ప్రేమించాలని లేదు."

"విషయం తెలియికముందు. తెలిశాక కూడా

రోగమా?"

"అప్పటికే ఆమె మనసులో ఎవరైనా వుండివుంటే?"

"అంటే నువ్వు వాత్సవను అప్పటికే ప్రేమించావా?"

"వాత్సవ మా నాన్నగారి దృష్టిలో నాకు తగిన వరుడు. ఆయన మాట తీసెయ్యలేకపోయాను."

"తర్వాత చింతించి వుంటావు."

"ఆ ఖర్మ నాకు లేదు."

"ఏం?"

"వాత్సవతో నా జీవితం హాయిగా వుంది."

"ఒక మాట చెబుతాను వింటావా?"

"గతం గురించి చెప్పక! ఇప్పుడేం చేస్తున్నావు?"

"చెప్పనా?"

"ఊఁ!"

"ఇంకా నీ కోసం వెయిట్ చేస్తున్నాను."

గౌరి రిసీవర్‌లోకి కోపంగా చూసింది. చటుక్కున క్రెడిల్ చేసింది.

ఈ మగాళ్ళకి బుద్ధివుండదు. తనకి పెళ్ళయి నాలుగేళ్ళయింది. ఏనాడో తనని కాలేజీలో చూసి మోజు పడ్డాడు శ్రీపతి. ఇంకా తనకోసం కాచుకున్నాడట.

గౌరి టవల్‌తో సుతారంగా మొహం అద్దుకుంది. హాండ్‌బాగ్ తీసుకుంది. డబ్బు లెక్క చూసుకుంది. దగ్గరగా లాగింది తలుపులు.

నడవాలోంచి కదిలి మెట్లు దిగుతోంది.

గుమ్మంలోకి చూసి తెల్లబోయింది.

హాలు గుమ్మంలో అతడు నిలబడివున్నాడు. ఫుల్‌సూట్‌లో వున్నాడు. నెత్తిమీద ఫెల్టు హాట్. చిరుగాలికి మెడలోని టై వూగుతోంది. లేత నీలిరంగు

కళ్ళద్దాలు పెట్టుకున్నాడు.

"శ్రీపతీ!" గొణిగింది గౌరి. నిర్వేరపాటును అణుచుకుంటూ గుమ్మంవైపు నడిచింది.

శ్రీపతి దరహాసం చేస్తున్నాడు.

"లోపలకు రావచ్చునా!" అన్నాడు శ్రీపతి.

చేసేదిలేక గౌరి వెనక్కి తిరిగింది. శ్రీపతి ఆమె ప్రక్క నడవసాగాడు.

ఇద్దరూ గౌరి గదిలో ప్రవేశించారు.

శ్రీపతి చొరవగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. గౌరి కార్పెట్ మీద అటూ యిటూ తిరుగుతోంది.

"తిన్నగా యింటికే వచ్చానని కోపమా?" నవ్వాడు శ్రీపతి.

గౌరి చురచుర చూసింది.

"నీ గొంతు ఫోన్ లో విన్నాను. నిన్ను చూడకుండా వుండలేను. తప్పయిపోయింది."

"పెళ్ళయిన ఆడదాన్ని వెంటాడటం తప్పని తెలుసన్నమాట!"

"కాని మనసు కోతిలాంటిది!"

"చూశావుగదా! వెళ్ళు!"

"గౌరీ నిన్ను మనస్ఫూర్తిగా ఈ నాటికీ ప్రేమిస్తోన్నాను."

"ప్రేమించు. నాకు చెప్పక!"

"నువు అవకాశం యిస్తే పువ్వుల్లోపెట్టి చూసుకుంటాను."

"డామ్ నాన్సెన్స్! బయటకు నడువ్."

"ప్రేమ కాదంటే, పగ రుచి చూస్తావ్!"

"బెదిరిస్తున్నావా?"

"లేదు. జరగబోయేది హెచ్చరిస్తున్నాను."

"పగ తీర్చుకో!"

"అప్పుడు వాత్సవ నీతో సంసారం చేయదు!"

"శ్రీపతీ నీకు ప్రేమతో మతి పోయింది! ఆట్టే వాగక!"

శ్రీపతి కుటిలంగా నవ్వాడు. కోటు జేబులో చెయ్యి పెట్టి ఓ కవరు తీశాడు. కవర్‌లోంచి ఫోటోలుతీసి ఆమెకు చూపించాడు.

గౌరి కళ్ళు చెదిరిపోయాయి. రంగుల ఫోటోలు! వాటిలో గౌరి వివిధ భంగిమలలో పండుకుని వుంది. ఆమె దుస్తులు అస్తవ్యస్తంగా చెదిరిపోయాయి. ఆమె ప్రక్కనే ముగ్గురు పురుషులు బట్టలు లేకుండా వున్నారు. ఆమె కళ్ళు మత్తుగా సోలివున్నాయి. గౌరి కేకలు పెట్టబోయి ఆగింది.

"ఏమిటివి? ఎలా తీశావు? అంతమంది మగాళ్ళతో... ఛీ....ఛీ....అలాంటి స్థితిలో ఎవర్నీ వూహించుకోను కూడా వూహించుకోలేను" గౌరి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

శ్రీపతి ట్రిక్ ఫోటోగ్రఫీ తీశాడు. కాని ఫోటోలు అచ్చమైన సహజ వాతావరణంలో తీసినట్టున్నాయి.

గౌరి మూగగా చూస్తోంది.

"గౌరీ! నీ గురించి నాకు తెలుసు. వాత్సవకూ తెలుసు. కాని ఈ ఫోటోలు చూస్తే వాత్సవకాదు— మీ నాన్న పరంధామయ్య కూడా నమ్మడు" ఫోటోలు కవర్‌లో పెట్టి కోటుజేబులో పెట్టుకున్నాడు శ్రీపతి.

"అవి ట్రిక్ ఫోటోలు! నేను నీకేం అపకారం చేశాను?"

"నా ప్రేమను తిరస్కరించావు!"

"ప్రేమ కుండవలసిన లక్షణం పగ సాధించడం కాదు!"

"నువు నాకు పాఠాలు చెప్పక!" శ్రీపతి చేతిలో పిస్తోలు మెరిసింది.

గౌరి విస్తుబోయింది.

"ఏమిటిది? నన్ను కాల్చి చంపుతావా?"

శ్రీపతి నవ్వి పిస్తోలు ఆమెకు అందించాడు.

"నాతో వచ్చెయ్యి! లేకపోతే నన్ను కాల్చెయ్యి! నీ అందమైన చేతులలో హాయిగా మరణిస్తాను!"

గౌరి తన చేతులలో మొహం కప్పుకున్నది.

"నువు నన్ను చంపలేకపోతే నేను ఈ ఫొటోలు వాత్సవకి అందించవలసి వస్తుంది!"

గౌరి ఏడుస్తోంది.

"ఫోటోలు చూపించక! ఎలాంటి నమ్మకస్తుడయినా ఈ నకిలీ ఫోటోలుతో మనసు విరచుకుంటాడు!"

"అందుకే నన్ను కాల్చి చంపెయ్!"

"ప్లీజ్ ! మరల నన్ను అలా కోరక!"

"అయితే మూడో పద్ధతి నువ్వు ఆలోచించు."

"నాకు తెలుయదు!"

"తొందర లేదు. మరల సాయంకాలం కలుసుకుందాం!"

"శ్రీపతి! నన్ను క్షమించి వదిలిపెట్టు! ప్లీజ్...."

"వదలను. పోనీ ఒక పని చెయ్యి!" పిస్తోలు అటూ యిటూ ఆడించాడు.

"ఏం చేయను?"

"రఘును చంపెయ్."

గౌరి పిడుగుపడినట్టు చూసింది.

"రఘునా? ఎందుకు?"

"నిన్ను రేప్ చేయాలని ప్రయత్నించినందుకు!"

"నీకు ఇంకా ఆ విషయం గుర్తుందా? నాలుగేళ్ళ నాటి మాట!"

"నువ్వు నన్ను ప్రేమించు. మాను. రఘును మాత్రం చంపు!"

"నామీద అతడు అఘాయిత్యం చేశాడు. అందుకు అప్పట్లో శిక్ష అనుభవించాడు."

"న్యాయమైన శిక్ష కాదు! మీ నాన్న కొరడా పెట్టి కొట్టాడు. అదేనా శిక్ష?"

"అతడు నా కాళ్ళమీద పడ్డాడు. క్షమాపణ కోరాడు. చాలు!"

"కాని నీ ప్రేమికుడిగా అది చాలదు నాకు!"

"శ్రీపతీ! పగ మర్చిపోవాలి. అప్పుడే జీవితాలు సుఖమయం!"

"నువు రఘు జీవిత విషయం ఆలోచించక! వాడికి చావే తగిన శిక్ష!"

"రఘూ నువ్వూ ఏం చేస్తారో చేసుకుంటారో నాకు అనవసరం!"

"నువు రఘును చంపకపోతే నేను ఈ ఫోటోలు వాత్సవికీ, పత్రికలకూ పంపించవలసి వస్తుంది!"

గౌరి తల బాదుకుంటోంది. "నీకు దయ లేదు!"

"అవును" శ్రీపతి వికటంగా నవ్వాడు.

"నన్ను నేను కాల్చుకు చచ్చిపోతాను."

"అప్పుడు కూడా ఈ ఫోటోలు అందవలసిన వాళ్ళకి

అందుతాయి. వాళ్ళకు నీ ఆత్మహత్యకి కారణం తెలుస్తుంది!"

గౌరి ఆలోచనలో పడింది.

శ్రీపతి పిస్తోలు తెరిచాడు. బుల్లెట్స్ ఫిట్ చేయసాగాడు.

3

"వెయిటర్!" పిలిచాడు రఘు.

వెయిటర్ వచ్చాడు.

"విస్కీ, కట్ లెట్స్, డబుల్ ఆమ్లెట్స్ చెప్పు!" అన్నాడు శ్రీపతి సిగరెట్టు ముట్టించి.

విన్నావు కదా అన్నట్టు రఘు తలూపాడు. వెయిటర్ వెళ్ళిపోయాడు.

"ఇపుడు చెప్పు! నన్ను ఎందుకు కలుసుకోవాలనుకున్నావు?" అడిగాడు రఘు.

"నీతో పని పడింది."

వెయిటర్ విస్కీ సీసా, కట్ లెట్స్, ఆమ్లెట్స్ సర్వ్ చేశాడు. గ్లాసులు సర్దాడు. రఘు సీసా తెరచి ద్రవం గ్లాసులలో ఒంపాడు.

ఇద్దరూ ఛీర్స్ చెప్పుకుని తాగడం మొదలుపెట్టారు.

"ఏమిటా పని?" అడిగాడు రఘు.

"నువు పరంధామయ్యను చంపాలి!"

"ముసలాడు వాడిగోల నీకెందుకు?"

ఇద్దరూ పదార్థాలమీద దాడి ప్రారంభించారు.

"వాడు నిన్ను హంటర్ తో కొట్టాడు!"

"శ్రీపతీ! అది నాలుగేళ్ళనాటి మాట!"

"ఈ నాలుగేళ్ళూ ఊరుకోవడం నీ పొరపాటు! నీకు పౌరుషంలేదు."

"నా న్సెన్స్.... శ్రీపతీ! నీకు ఈ రోజు ఏమయింది?"

"నీమీద పరంధామయ్య కసితీర్చుకున్నాడు."

"మంచిదే అయింది!"

"ఏమిటా మంచి?" శ్రీపతి గ్లాసులు నింపాడు.

"నేను గౌరిని ప్రేమించాను. ఆమెమీద అఘాయిత్యం చేశాను. ఆమె తిరస్కరించింది. అప్పుడే నేను బుద్ధి తెచ్చుకోవలసింది. ఆమె తండ్రి నన్ను కొరడాతో చితకబాదాడు. లేకపోతే...."

"రఘూ నువ్వేనా ఈ మాటలంటోంది!"

"అవును. లేకపోతే నేను రేపిస్టుగా మిగిలపోయేవాడిని."

"కాదు పరంధామయ్యను అప్పట్లో చంపివుండవలసింది. గౌరి నీ సొంతమయేది."

"గౌరిని ప్రేమతో జయించాలి. అంతే కాని, ఆమె తండ్రిని చంపికాదు."

"నీకు యింకా గౌరిమీద ప్రేమ చావలేదు."

"శ్రీపతీ!గౌరి తన భర్తతో సంసారం చేసుకుంటోంది. ఆమె ప్రేమ అతడికే పరిమితం! నేనూ ప్రేమిస్తాను ఆమెను. కాని ఒక ప్రేమకురాలిగా కాదు. ఒక మంచి గృహిణిగా."

ఇద్దరూ గాసులు ఖాళీచేశారు. పదార్థాలు ఖాళీ అయాయి. వెయిటర్ మరల ఆమ్లెటు తెచ్చిపెట్టాడు. రఘు మత్తుగా చూశాడు.

శ్రీపతి కోటుజేబులోంచి కవర్ తీశాడు. రఘుకు ఫోటోలు అందించాడు.

రఘు ఫోటోలు చూశాడు. మత్తు దిగిపోయింది.

"శ్రీపతీ! నీకు సిగ్గులేదూ!" అరిచాడు రఘు.

"అవశక. గౌరి పరువు బజారున పడుతుంది."

"నీకు గౌరి ఏం అపకారం చేసింది?"

"అదంతా నీకు అనవసరం!"

"నిన్ను చంపుతాను శ్రీపతీ! పరంధామయ్యను కాదు!"

"నన్ను చంపు! ఆ తర్వాత ఈ ఫోటోల నెగటివ్స్ పోలీసులకు అందుతాయి."

"అందితే?"

"పిచ్చివాడా? గౌరి ప్రక్క నగ్న పురుషులలో నువ్వూ వున్నావు."

"ఆఁ!"

"సరిగ్గా చూడు. నగ్నంగా ఉండటంమూలాన నిన్ను నువే గుర్తుపట్టలేకపోయావు."

"శ్రీపతీ!"

శ్రీపతి పకపక నవ్వి, "మత్తు దిగిపోయిందా?" అన్నాడు.

"అవును. దిగింది!"

"పద! నా రూంకి వెళ్ళి మాట్లాడుకుందాం!"

రఘు కదిలాడు. బిల్లు చెల్లించి టాక్సీలో బయలు దేరారు. నేతాజీ వీధిలో 201 నెంబర్ యింటి ముందు టాక్సీ ఆగింది.

ఇద్దరూ రఘు గదిలో కూర్చున్నారు.

"నువు పరంధామయ్యను చంపు. నీ కసి తీర్చుకో."

"లేకపోతే?" అడిగాడు రఘు.

"ఈ ఫోటోలు వాత్సవకూ, పత్రికలకూ, పోలీసులకూ అందుతాయి. గౌరి సంసారం బజారుపాలవుతుంది."

"తండ్రి చచ్చిపోతే గౌరి ఏడుస్తుంది!"

"ఈ వయసులో ఆమెకు కావలసింది వాత్సల్యం."

"పరంధామయ్య మీద నీకు కోపం దేనికి?"

"నిన్ను కొరడాతో కొట్టాడు. అందుకే!"

"అబద్ధం చెబుతున్నావు!"

శ్రీపతి కత్తి తీశాడు. "ఈ కత్తితో నన్ను చంపెయ్."

"నిన్నా? చంపను?"

"అయితే పరంధామయ్యను చంపు."

4

బల్లమీద టెలిఫోన్ గణగణలాడింది.

శ్రీపతి సిగరెట్టును యాష్ట్రేలో కుక్కాడు. ఫోన్ అందుకున్నాడు.

అవతల గౌరి మాట్లాడుతోంది.

"శ్రీపతీ! నువ్వు నన్ను ఇరకాటంలో పడేశావు."

"లేదు గౌరీ! నువ్వు రైఫిల్ షూటింగ్ ట్రయినింగ్ అయ్యావు. నీ శిక్షణకు సార్థకత లభించబోతోంది!"

"పాపం రఘు!"

"దుర్మార్గులు ఈ ప్రపంచంలో బతకగూడదు."

"శిక్షించడానికి మనం ఎవరము?"

"బాధలను అనుభవించినవాళ్ళకు శిక్షించే హక్కు వుంది!"

"..........."

"గౌరీ! దుర్మార్గుడు ఒక్కరికే అపకారంచేసి వూరుకోడు."

"ఆల్ రైట్! రఘును షూట్ చేస్తాను."

"బుద్ధిమంతురాలివి!"

"కాని నాదో అనుమానం!"

"ఏమిటిది?"

"నేను రఘును షూట్ చేసేటప్పుడు నువు ఫోటోలు తీస్తావు. అసభ్య చిత్రాలూ, వాటి నెగెటివ్స్ ఇస్తావు. కాని ఈ తాజా ఫోటోలతో మరల నన్ను కీలుబొమ్మను చేసుకుంటావు."

"గౌరీ! నువు నన్ను అనుమానిస్తోన్నావా?"

"ఏం అనుమానించ కూడదా!"

"గౌరీ! నువ్వే నా ప్రాణం!"

"గౌరి నీవు వూహించినంత వెర్రిబాగులది కాదు!"

"దటీజ్ నైస్!"

"రఘు దినచర్య ఏమిటి?"

"ఈ రోజు రాత్రి 9-45కి అతడు రూంకి వస్తాడు. అతడిని అతడి గదిలో వుండగానే షూట్ చేయాలి. రాత్రి 10 గంటలు లోపున కర్మకాండ ముగిసిపోవాలి."

"అడ్రసు చెప్పు!"

"201, నేతాజీ వీధి."

"ఇల్లు సులువుగా దొరుకుతుందా?"

"అవును. సరిగ్గా ఎలక్ట్రిసిటీ ఆఫీసు వెనక వీధిలో."

"రైట్!"

"నాకు 10-30కి ఫోన్ చేయి!"

"పని ముగించినట్టు చేస్తాను!"

శ్రీపతి రిసీవర్ ముద్దు పెట్టుకున్నాడు. క్రెడిల్ చేశాడు. టెలిఫోన్ మరల గణగణలాడింది.

"రఘు!" గొణిగాడు శ్రీపతి రిసీవరందుకుంటూ.

"ఎస్" అన్నాడు శ్రీపతి!

"రఘూ స్పీకింగ్."

"చెప్పు. నేను శ్రీపతిని!"

"నాకు పని ఒప్పచెప్పావు. పని చేయడం తప్పదా?"

"నీ ప్రియురాలు సుఖపడాలంటే!"

"శ్రీపతీ! నువు నన్ను గొప్ప సంకటంలో పెట్టావు!"

"ప్రేమంటే అంతేరా పిచ్చివాడా!"

"నేను గారికి ప్రాణం పెడతానని నీకు తెలియడం ప్రమాదమయింది!"

శ్రీపతి నవ్వి, "రాత్రి 9 గంటలకు అతడు యింటికి వస్తాడు. ఇంట్లోనే పని ముగించు!" అన్నాడు.

"ఆల్ రైట్! తొమ్మిది గంటలకు పరంధామయ్య బతికి వుండడు. నీకు తొమ్మిదీ ముప్ఫయికి ఫోన్ చేస్తాను."

"గుడ్ బాయ్!"

"శ్రీపతీ! మరల దీంట్లో కూడా డబుల్ క్రాస్ చేశావంటే తర్వాత వొంతు నీది!"

"తప్పకుండా! నేను ముందే నీకు ఆఫర్ యిచ్చాను!"

అవతల క్లిక్ మన్నది. శ్రీపతి పకపక నవ్వుకున్నాడు.

"ఈ రాత్రి కాళ రాత్రి!" పకపక నవ్వాడు.

శ్రీపతి గదికి తాళం పెట్టి బయటకు నడిచాడు. మోటారుసైకిలు ఎక్కాడు. విల్లు విడిచిన బాణంలాగా వాహనం దూకింది.

పరంధామయ్య యింటిముందు వాహనం ఆపాడు.

పరంధామయ్య సిటింగ్ రూంలో కూర్చున్నాడు.

శ్రీపతిని నవ్వుతూ చూశాడు.

"చాల కాలమయింది శ్రీపతీ! మనం ఆటవేసి!" అన్నాడు పరంధామయ్య.

శ్రీపతి కుర్చీలో కూలబడి, "బల్లా, పావులూ తీయండి మామయ్యా!" అన్నాడు.

పరంధామయ్య చదరంగం బల్ల తీసి పావులు దానిమీద ఒంపాడు. తెల్లపావులూ నల్లపావులూ.

శ్రీపతి తెల్లపావులు తనవైపు సర్దుకున్నాడు.

ఆట రంజాగా సాగుతోంది. గంటన్నర గడిచింది.

పరంధామయ్య బలగం ఒక్కొక్కటీ బుట్టలోకి వెళ్తోంది.

"చెక్!" అన్నాడు శ్రీపతి.

పరంధామయ్య కలవరపడ్డాడు.

మరో రెండు ఎత్తులు వేసే అవకాశం వుంటే తన శకటం బతుకుతుంది. తన రాజుకు అతడి గుర్రమూ, ఏనుగూ వలవేశాయి. తాను అతడి బంటును కొట్టాలి. బంటును కొడితే రాజు బలవుతాడు.

ఇరకాటం!

తెల్ల బంటు చచ్చాడు. నల్లరాజు పడిపోయాడు.

"భలే ఆట!" మెచ్చుకున్నాడు పరంధామయ్య.

గుమ్మంలో అలికిడయింది. గౌరి తెల్లబోయి ఇద్దరినీ చూస్తోంది.

"రా తల్లీ! నిలబడిపోయావేం?" ఆదరంగా లేచాడు పరంధామయ్య.

గౌరి రాతిబొమ్మలాగా చూస్తోంది. శ్రీపతి అమాయకంగా పావులు సర్దుతున్నాడు.

గౌరి వెనక్కి పరుగెత్తింది.

పరంధామయ్య ఆమెను పిలిచేలోపున కారు డ్రయివ్ చేసుకుంటూ వెళ్ళిపోయింది.

"అదేమిటి? గౌరి ఎందుకు పారిపోయింది?" తనలో తానే మాట్లాడుకున్నాడు పరంధామయ్య.

"ఈమేనా మీ అమ్మాయి!"

"అవును శ్రీపతీ!"

"ఇదే చూడటం ఈమెను!"

"నీకు పరిచయం చేయాలనుకున్నాను!"

"అక్కరలేదు మామయ్యా! ఈమెను యింతకుముందే కొన్ని ఫోటోలలో చూశాను."

"ఆమె పెళ్ళి ఫోటోలేమో! వాత్సవ తెలుసుగదా నీకు!"

"తెలియదు. ఆమె పెళ్ళిఫోటోలు నేను చూడలేదు."

"అయితే ఎక్కడ చూశావు?"

"శేషగిరి చూపించాడు."

పరంధామయ్య నుదురు చిట్లించాడు.

"శేషగిరి నీకు తెలుసా?"

"బార్ నడుపుతాడూ—ఆ శేషగిరేనా?"

"అవును."

"నాకు అమ్మాయి కావాలన్నాను. ఫోటోలు చూపించాడు."

"బ్రోకర్ వెధవ! నన్ను మోసం చేసింది చాలదూ!"

"మోసమా?"

"ఇద్దరమూ కలసి బార్ పెట్టాం. మూడేళ్ళు బ్రహ్మాండంగా నడిచింది. అటు తర్వాత నష్టాలు చూపించాడు. ఎక్కడెక్కడో సంతకాలు పెట్టించాడు. చివరకు బార్ అతడి పరమయింది."

"నమ్మకద్రోహం!"

"ఈ రోజుల్లో ఎవరినీ నమ్మకూడదు!"

"నాకులాగా దురలావాట్లు బయటపెట్టుకునేవాడిని తప్పా?"

"ఆ వెధవకు గారి ఫోటో ఎలా వచ్చింది?"

"అతడి వ్యాపార రహస్యం ఎలా చెబుతాడు?"

"ఫోటో వుందా నీ దగ్గర?"

శ్రీపతి సంశయంగా చూశాడు. "వుందికాని పెద్ద వారు...."

"వాడు నాం పెద్దరికం ఏమైనా వుంచాడా? ఫరవా లేదు."

ఇక తప్పదన్నట్టుగా శ్రీపతి కవర్ లోంచి ఫోటో తీశాడు. కలర్ ఫోటో. గౌరి అస్తవ్యస్తంగా వున్న దుస్తులతో పండుకుంది. ఆమె ప్రక్క నగ్న పురుషులు!

పరంధామయ్య వెర్రెత్తిపోయాడు.

"రాస్కెల్! వాడిని చంపుతాను" అరిచాడు.

"నాకే చంపాలనిపిస్తోంది. కన్న తండ్రి మీకు ఎలా ఉంటుందో...."

"నేనే చంపాలి! నా చేతులతో...."

"మామయ్యా! కంగారు పడకండి! మీ చేతులకు మట్టి అంటుకోకూడదు."

పరంధామయ్య పళ్ళు పటపట నూరాడు.

"ఎలా చంపాలి?"

"మీరు అతడిని ఏడు గంటలకు బార్ లో వున్నట్లు నిర్ధారించుకోనండి."

"బార్ లోనా? అంత బహిరంగంగానా?"

"కాదు. అతడు బార్ లో వుంటే మీరు అక్కడికే వెళ్ళండి!"

శ్రీపతి వివరించి చెప్పసాగాడు.

"ఈ పద్ధతి మీకు పూర్తిగా అంగీకారమయితేనే."

"అంగీకారమే. కాని ఇంట్లో అందరూ నన్ను చూస్తారు."

"అతడి యింట్లో అతడి వాళ్లు ఈ రోజు బయటకు వెళ్లారు."

"ఎక్కడికి వెళ్లారు?"

"బంధువుల యింట్లో ఏదో శుభకార్యం వున్నది!"

"వెరీగుడ్! నువ్వు మంచి సమాచారం సేకరించావు."

"మామయ్యా! అవమానం మీకయినా నాకయినా ఒక్కటే!"

"కాని....అతడిని చంపడానికి మార్గం?"

"కత్తులూ, పిస్తోళ్ళూ వద్దు. నా దగ్గరో యంత్రం వుంది!"

"ఏమిటీ మనుషులను చంపే యంత్రమా?"

"అవును. విపరీతమైన శబ్దాలను పుట్టిస్తుంది. మెదడు లోని నరాలు చిట్లి హేమరేజ్ తో చస్తాడు ఆ శబ్దాలు వింటే!"

"చావకపోతే?"

"విషం పనిచేయకపోవచ్చు. కత్తి వంకరపోవచ్చు. పిస్తోలు గురి తప్పవచ్చు. యంత్రం చంపితీరుతుంది!"

"యంత్రాన్ని అతిడి గదిలో ఫిక్స్ చేసి వస్తే చాలునా?"

"అవును. శేషగిరి ఆ గదిని సౌండ్ ప్రూఫ్ చేసు కున్నాడు. గుమ్మం ప్రక్కనే గదిలో టేబులు వుంటుంది. శేషగిరి తన గదిలో టేబులు లైటునే వెలిగిస్తాడు. టేబులు లైటు అమరిక టే బు లు లో వుంటుంది. ఎలక్ట్రిసిటీని తాత్కాలికంగా ఆపి...." శ్రీపతి అభి నయంతో వివరించి చెబుతోన్నాడు.

పరంధామయ్య సస్పెన్స్ చిత్రం చూసినట్టు ముందుకి వాలి చెవులూ కళ్ళూ అతడికి ఒప్పగించేశాడు.

5

నాలుగు రోడ్ల కూడాలి.

గడియారస్తంభం ఏడుగంటలు కొట్టింది. రోడ్లమీద దీపాలు దేదీప్యమానంగా వెలుగుతోన్నాయి. జనం పల్చబడ్డారు. వాహనాలు అటూ యిటూ తిరుగుతోన్నాయి.

పరంధామయ్య రోడ్డుమీద ఆగాడు. గడియారస్తంభం నీడలోకి నడిచాడు. రోడ్డుకి అవతల బార్ కలకలలాడుతోంది.

శేషగిరి కౌంటర్‌లో కూర్చున్నాడు.

పరంధామయ్య కీనీడలో తనని తాను ఒకసారి చూసుకున్నాడు.

లూజ్ షరాయిమీద మోకాళ్ళు దాటిన లూజ్ షర్టూ, పల్చగా పెరిగిన ముసలి గడ్డమూ, సున్నగా గీసిన మీసమూ, కాళ్ళకు చడావులూ, నెత్తిమీద నల్ల టోపీ, తృప్తికరంగా వుంది మారువేషం.

పరంధామయ్య రోడ్డు దాటాడు. బార్‌లో ప్రవేశించి శేషగిరి ముందు నిలబడ్డాడు.

గొంతు సవరించుకొని, "మీతో ఒక్క అయిదు నిమిషాలు!" అన్నాడు హిందీ యాసతో.

శేషగిరి ఆశ్చర్యంగా చూసి, "బి జి నె స్సా?" అన్నాడు.

"అమ్మాయిలు! దిగుమతి!"

శేషగిరి గ్గున లేచాడు. "రండి! లోపలకూర్చుందాం!" అన్నాడు. కౌంటర్ వెనుక చిన్న గదిలోకి నడిచారు యిద్దరూ.

శేషగిరి బాటిలు అందుకొని బల్లమీద పెట్టాడు.

బల్లకి అటూ యిటూ యిద్దరు కూర్చున్నారు. శేషగిరి బాటిలు విప్పాడు.

రెండు గ్లాసులలో ద్రవాన్ని నింపాడు.

"ఐస్ క్యూబ్స్!" అన్నాడు పరంధామయ్య.

శేషగిరి బయటకు నడిచాడు.

పరంధామయ్య ఒక గ్లాసులో మాత్ర వేశాడు. రిలాక్సింగ్ గా వెనక్కి వాలాడు.

ఐస్ క్యూబ్స్ తో శేషగిరి వచ్చాడు. గ్లాసులలో వేశాడు.

ఇద్దరూ తాగారు.

శేషగిరి కుర్చీలో ముందుకు వాలాడు. బల్లమీద తల పెట్టాడు. మరుక్షణంలో గురక పెట్టి నిద్రపోతున్నాడు.

పరంధామయ్య లేచాడు. శేషగిరి జేబులోంచి తాళం చెవులగుత్తి తీశాడు. జేబులోంచి మైనపు పలక తీశాడు.

ఇంటి తాళం గుర్తుపట్టాడు. తాళంచెవుల అచ్చులు పలకమీద తీశాడు. యథాప్రకారంగా తాళంచెవుల గుత్తిని శేషగిరి చేతులో వుంచి బార్ లోంచి బయట పడ్డాడు. అచ్చు ప్రకారంగా అరగంటలో తాళంచెవులు కట్ చేయించాడు.

టాక్సీలో శేషగిరి యింటివద్ద దిగాడు.

ఇంటికి తాళం పెట్టివుంది. పరంధామయ్య తాళం తెరిచాడు. శేషగిరి ఉపయోగించే గదిలోకి నడిచాడు. జేబులోంచి చిన్న ట్రాన్సిస్టర్ లాంటి పరికరం తీశాడు.

గదిలో లైటు వెలిగించాడు.

టేబులు వద్ద ఆగి పరికరాన్ని దాని మీద వుంచాడు.

వీధిలో కారు ఆగిన చప్పుడయింది.

పరంధామయ్యకు గుండెలు దడదడ లాడాయి.

వరండాలోకి పరుగెత్తి చూశాడు.

శ్రీపతి! కారులోంచి తల బయటపెట్టి చూస్తున్నాడు.

"వ్రేలిముద్రల విషయం జాగ్రత్త!" అన్నాడు శ్రీపతి.

పరంధామయ్య తలూపి లోపలకు నడిచాడు.

కారు బయలుదేరిన శబ్దం వింటూ నిట్టూర్చాడు.

6

కత్తిని కాగితానికి చుట్టి పాంటులోకి దోపాడు రఘు. వాచీ చూసుకున్నాడు. రాత్రి 8-45 అయింది. గదికి తాళం పెట్టాడు.

ఆటోమొబైలు షాపులోకి నడిచాడు.

షాపు అతడు రఘును పలకరించాడు.

"తాళంచెవులియ్యి. స్కూటర్ వేసుకువెళ్ళాలి!" అన్నాడు రఘు.

షాపు అతడు తాళంచెవులు యిచ్చాడు.

రఘు స్కూటర్ పోనిచ్చాడు.

పరంధామయ్య యింట్లో దీపాలు వెలుగుతోన్నాయి.

రఘు స్కూటర్‌ను రోడ్డు ప్రక్క పార్క్ చేసి ఇంటివైపు నడిచాడు.

పరంధామయ్య ఈజీఛెయిర్‌లో కూర్చున్నాడు.

ప్రహారీ గోడవద్ద ఆగాడు రఘు. వరండాలో దీపం వెలుగుతోంది. వెలుగు వాకిట్లో పడుతోంది. పరంధామయ్యను సమీపించాలంటే వెలుగులోంచి నడవాలి. ఇంట్లో వంటవాడూ, పనిమనిషే ఉంటారు. వాళ్ళు ఉన్నారో వెళ్ళిపోయారో.

రాత్రిళ్ళు పరంధామయ్య ఒంటరిగా వుంటాడు.

రఘు ప్రహరీ గోడమీద చేతులాన్చి అవతలకు గెంతాడు.

మొక్కల చాటున ఆగాడు. వరండాలో పరంధామయ్య తల వొంచుకొని, మొహం అరచేతులతో కప్పుకున్నాడు.

రఘు ఒక్క పరుగున వరండాలోకి పరుగెత్తాడు. ఒక్క ఉదటున కత్తిలాగి పట్టుకున్నాడు. పరంధామయ్య ఉలిక్కిపడ్డాడు తలెత్తబోయాడు.

రఘు అతడిమీదకు దూకాడు.

పరంధామయ్య గింజుకోబోయాడు. అప్పటికే ఆలస్యమయింది.

7

గౌరి బల్లసొరుగు తెరచింది. నల్లటి పిస్తోలు నిగనిగలాడుతోంది. గౌరి పిస్తోలు అందుకుంది. హాండ్ బాగ్ లో సర్ది బాగ్ భుజానికి తగిలించుకుంది. వాచీ చూసుకుంది. 9-30 అయింది.

శ్రీపతి ఫోన్ చేసింది. అవతల రెస్పాన్స్ లేదు.

గౌరి కారులో బయలుదేరింది. రోడ్లన్నీ జనంతో రద్దీగా వున్నాయి. మొదటి ఆట సినిమా వదిలిపెట్టినట్టున్నారు.

కారు నేతాజీ వీధిలో పరుగెత్తుతోంది. ఎలక్ట్రిసిటీ ఆఫీసు వెనక రోడ్డుమీద ఆగింది కారు. వెలుగు ఉండగానే తాను నెం. 201 యిల్లు గుర్తుపట్టుకోవడం మంచిదయింది. రోడ్డుమీద దీపాల కాంతిలో ఇండ్ల నెంబర్లు కనిపించాయి.

ఇంటి నెం. 201 నిశ్శబ్దంగా వుంది. కిటికీలోంచి జీరోబల్బ్ వెలుగు కనిపిస్తోంది. కారు ముందుకు పోనిచ్చి ప్రక్క సందులో ఆపింది గౌరి. కారు దిగింది. హాండ్

బాగ్ భుజానికి తగిలించుకొని ఇంటి నెం. 201 వైపు నడిచింది.

దూరంనుండి స్కూటర్ వస్తోన్న చప్పుడయింది.

గౌరి చప్పున డస్టుబిన్ చాటున దాక్కుంది.

స్కూటర్ నెం. 201 యింటిముందు ఆగింది.

రఘు హుషారుగా స్కూటర్ దిగాడు. ఇంటి మెట్లు ఎక్కాడు.

తాళంచెవులు ఆడించి తలుపు తెరిచాడు.

తలుపు దగ్గరగా వేసి లైటు వేశాడు. కిటికీలోంచి వెలుగు పడుతోంది. గౌరి పిస్తోలు బయటికి తీసింది. సేఫ్టీ కాచ్ తప్పించింది. తలుపులు సమీపించి బయట గొళ్ళెం పెట్టింది.

"ఎవరు?" అడిగాడు రఘు.

కిటికీలో నీడపడింది. గౌరి అదిరే గుండెలను అదుపులో పెట్టుకుంది.

కిటికీవైపు చూసి పిస్తోలు ప్రేల్చింది.

రఘు అరిచాడు. గౌరి మరల ప్రేల్చింది.

రఘు తలుపులు తెరవడానికి ప్రయత్నించాడు. గౌరి గుండెలలో రాయి పడింది. బుల్లెట్లు రఘుకు తగలలేదు. గౌరి రోడ్డుమీదకు పరుగెత్తింది. కాళ్లకు చీర అడ్డుపడు తోంది. చీర ఎత్తిపట్టి పరుగెత్తి కారులో కూర్చుంది. మరుక్షణంలో కారు రోడ్డుమీదకు దూకింది.

ఇంటి నెం. 201 తలుపులు తెరచుకోవడం తెలు స్తోంది. రఘు ఇంటి వెనకనుండి తిరిగివచ్చి తలుపులు తెరచివుంటాడు.

గౌరి వెనక్కి చూడదల్చుకోలేదు.

రఘు రోడ్డుమీదకు వచ్చాడు. కారు రోడ్డు మలుపు తిరుగుతోంది. స్కూటర్ స్టార్టుచేశాడు. ఇంటికి తాళం పెట్టాలని కూడా అతడికి తోచలేదు. స్కూటర్ పరుగెత్తుతోంది.

ఎర్రటి లైట్లు చీకట్లో మెరుస్తున్నాయి.

కారు అకస్మాత్తుగా మలుపు తిరిగింది. రఘు కళ్ళు చించుకు చూశాడు. గడియార స్తంభంవద్ద రోడ్డు నాలుగు దిశలుగా చీలిపోయింది.

కారు ఏ రోడ్డున వెళ్ళిందో అయోమయమైపోయింది.

రఘు పళ్ళు పటపట కొరికాడు. తనను శ్రీపతే పరంధామయ్య హత్య కోసం నియోగించాడు. తిరిగి తనను కాల్చి చంపమని ఎవరినో నియోగించాడు. లేక తనే కాల్చి చంపాలని ప్రయత్నించాడా?

శ్రీపతి మానసికంగా దెబ్బ తినలేదు కదా! తాను అతడి మాటలు నమ్మి పరంధామయ్యను చంపేశాడు. కత్తిమీద తన వ్రేలిముద్రలు చెరిపేశాడు. అదృష్టం! తను చంపినట్టు శ్రీపతి కూడా ఋజువు చేయలేదు.

'రాస్కెల్!' తిట్టుకున్నాడు రఘు.

శ్రీపతి ఇంటిముందు స్కూటర్ ఆపాడు. రఘు స్కూటర్ దిగాడు.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. తలుపులకు తాళం పెట్టి వుంది. రఘు తన స్కూటర్‌ను చీకట్లోకి నడిపాడు. ఇంటిముందు నిఘా వుంచి కూర్చున్నాడు.

శ్రీపతి తన కళ్ళు కప్పలేదు. ఇప్పటికే తానో హత్య చేశాడు. శ్రీపతిగాడిని చంపాలి.

రఘు పళ్ళు పటపట నూరసాగాడు.

8

శేషగిరి ఉలిక్కిపడి నిద్రలేచాడు. బార్ నిశ్శబ్దంగా వుంది. శేషగిరి వాచీ చూసుకున్నాడు. రాత్రి పదిగంట లయింది. జరిగింది గుర్తుకు తెచ్చుకోవడం మొదలు పెట్టాడు.

ఏడు గంటలు దాటాక ఎవరో పఠాన్‌లాగా వున్న వ్యక్తి వచ్చాడు. తిన్నగా కౌంటర్ ముందు నిలబడి 'అమ్మాయిలు! దిగుమతి!' అన్నాడు. తాను అతడిని ఈ గదికి తీసుకు వచ్చాడు. ఐస్ క్యూబ్ కోసం తాను వెళ్ళి నప్పుడు పఠాన్ గ్లాసులోని ద్రవంలో ఏదో మత్తుమందు కలిపాడు. తనవలన అతడికి ఏం కావాలి?

ఎవరతను? తాను మత్తులో పడ్డాక అతడు వెళ్ళి పోయాడా?

శేషగిరి గదిలోంచి బయటపడ్డాడు.

వర్కర్స్ తనని అయోమయంగా చూస్తోన్నారు.

వాళ్లలో ఒకడు కౌంటర్ లో కూర్చున్నాడు. శేషగిరికి సిగ్గుగా తోచింది. తాను ఎవరో అపరిచితుడివద్ద మోసపోయాడు.

బార్ మూయించి శేషగిరి ఇంటికి బయలుదేరాడు. శేషగిరి భార్యాపిల్లలూ బంధువుల ఇంటినుండి అప్పటికే తిరిగివచ్చారు.

"మీరు రాలేదని మీ చిన్నత్తగారు చాలా బాధ పడింది!" అంది శేషగిరి భార్య.

శేషగిరి తలూపి భోజనం ముగించుకున్నాడు.

పఠాన్ చేతిలో తాను మోసపోయాడు. అతడు ఎవరు? ఎందుకు వచ్చాడు? విషయాలు తెలిస్తే తనకు ఈ మనక్షోభ వుండదు.

శేషగిరి తన గది తలుపు తెరిచాడు. లోపలకు నడిచి తలుపు దగ్గరగా తోసి తాళం నొక్కాడు.

ఇక తనను తెల్లారేవరకూ డిస్టర్బ్ చేసేవాళ్ళుండరు.

చేతులు తడిమి స్విచ్ నొక్కాడు. లైటు వెలగ లేదు. సన్నగా చప్పుడు వస్తోంది. ఏమిటా చప్పుడు. వీణ మీద ఒక తీగెను వాయించినట్లు సన్నటి శబ్దం. రాను రాను శబ్దం తీవ్రత పెరుగుతోంది. శబ్దం గది అంతా పరచుకుంటోంది. శబ్దానికి అటూ ఇటూ ప్రకంపనాలు మొదలయ్యాయి.

చెవులు హోరెత్తిపోతూన్నాయి. శబ్దం వింటూంటే ఏమీ తోచడంలేదు. మస్తిష్కంలో శబ్దం హోరు తప్ప ఏమీ లేదు.

శేషగిరి చెవులలో వ్రేళ్ళు జొనిపాడు. అయినా శబ్దం హోరెత్తిపోతూ చెవుల్లో చొరబడుతోంది. చెవి పొరలు డబడబలాడుతోన్నాయి. కణతలమీద నరాలు పొంగుతోన్నాయి. శబ్దాల మధ్య సన్నపాటి ఈల!

శేషగిరి జుత్తు పీక్కుంటున్నాడు. తాళం తెరచి తలుపు తీయాలన్న ఆలోచనే రావడంలేదు.

శబ్దం! చెవులు గింగుర్లెత్తేలాగా వలయాలు వల యాలుగా గదిలో పరుచుకుంటోంది. సైరన్ కూస్తున్నట్టూ రైలు యింజన్ బయలుదేరుతోన్నట్టూ, విమానం ప్రొపెల్లర్స్ హోరెత్తి తిరుగుతోన్నట్టూ, బండలు దొర్లుతున్నట్టూ, వందల వేల జలపాతాలు ఒకేసారి ఉరుకుతోన్నట్టూ, సన్నటి దారిలోంచి ఎక్కువ శబ్ద తరంగాలు దూసుకువస్తోన్నట్టూ భయంకరమైన ఈలా, శేషగిరి భరించలేకపోతున్నాడు.

కణతలు పగిలిపోతున్నాయి. శేషగిరి బోర్లాపడ్డాడు. తలకు దెబ్బ తగిలింది.

9

కారు గేటుముందు ఆగింది. గౌరి పిచ్చిగా హారన్ కొడుతోంది. ఇంట్లో, పోర్టికోలో దీపాలు వెలుగుతోన్నాయి. పనిమనిషి పరుగెత్తుకు వచ్చి గేటు తెరచింది.

కారును లోపలికి పోనిచ్చింది గౌరి.

గేటు మూసి పోర్టికోలోకి వచ్చింది పనిమనిషి.

"అయ్యగారు వచ్చారమ్మా!" అంది పనిమనిషి.

గౌరి ఉలిక్కిపడింది. వాత్సవ అప్పుడే వచ్చేశాడా? రేపు ఉదయమే వస్తాడని తాను ఆశించింది. రఘును చంపలేకపోయింది తాను. శ్రీపతికి ఆ విషయం తెలుస్తుంది. తన గురించిన అసభ్య చిత్రాలు తన భర్తకు చూపిస్తాడు శ్రీపతి. తన బతుకులో నిప్పులు కురుస్తాయి.

ఛీ....ఎంత పని జరిగింది.

పిస్తోలు గురి తప్పడం ఏమిటి? తాను మూడు తూటాలు కాల్చింది.

"గౌరీ!" గుమ్మంలో భర్త.

గౌరి గాభరాగా ఇగ్నిషన్ కీ తీసుకుంది. మనసు నిగ్రహించుకుంది. డోర్ మూసి భర్తవైపు నడిచింది.

"మీరు ఎప్పుడు వచ్చారు?"

"ఇప్పుడే. అరగంట అవుతుంది. నువ్వెటయినా వెళ్ళివుంటావని పనిమనిషిని పిలిచాను. ఇంతలో నువ్వే వచ్చావు" అన్నాడు వాత్సవ.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మేడమెట్లు ఎక్కారు. పనిమనిషి మెయిన్ హాలులో కూర్చుండిపోయింది.

అద్దాల కిటికీలోంచి పోర్టికో, తోట కనిపిస్తోన్నాయి.

పనిమనిషి ఉలిక్కిపడింది. పోర్టికోలో నీడ కదులుతోంది. పనిమనిషి మెల్లగా లేచింది. కిటికీవద్దకు నడిచింది. పోర్టికోలో నిజంగానే ఎవరో వున్నారు. మొక్కల చాటున దాక్కున్నాడు. అతడి వీపు స్పష్టంగా కనిపిస్తోంది.

పనిమనిషి, "ఎవరది?" అంది వణుకుతూ.

అతడు మెల్లగా లేచాడు. వెలుగు మొహంమీద పడుతోంది.

పనిమనిషి గుర్తుపట్టింది. శ్రీపతి బాబుగారు!

"బాబుగారూ! మీరా?" అంది పనిమనిషి.

శ్రీపతి ఆమెను గుర్తుపట్టి 'హుష్!' అన్నాడు.

అదే సమయంలో మెయిన్ హాలులో ఫోన్ గణగణలాడింది.

"వెళ్ళు. ఫోన్ చూడు!" అన్నాడు శ్రీపతి.

పనిమనిషి తెలివితెచ్చుకున్నది. ఫోన్ వున్న బల్లవైపు తరుగెత్తింది.

శ్రీపతి నిట్టూర్చాడు.

గౌరి పదిన్నరకు తనకు ఫోన్ చేస్తానన్నది. ఇప్పుడు 10-35 అయింది. ఆమె ఇంట్లో ఫోన్ చేస్తోండగా తాను ఇక్కడ వుండాలనుకున్నాడు.

తన పథకం ప్రకారంగా వాత్సవ వచ్చేశాడు.

వాత్సవ ఆమె మాటలు వినాలి. ఆమెను గద్దించాలి. ఆమెను సున్నితమైన ఇరకాటంలో పెట్టాలి.

పనిమనిషి ఫోన్ కాల్ మేడమీదకు అందిస్తోంది.

మేడమీద గదిలోంచి గౌరి మాట్లాడుతోంది. మరుక్షణంలో ఆమె చేతిలోంచి రిసీవర్ జారిపడిన చప్పుడు.

శ్రీపతి నవ్వుకున్నాడు. పరంధామయ్య చనిపోయిన వార్త వచ్చి ఉండాలి. వరండాలోనే వుంది శవం. తాను శవాన్ని చూసి లైటు ఆర్పి వచ్చాడు. పరంధామయ్య చచ్చిపోయినట్టు ఎవరు చెప్పారు?

గౌరి గద్గదంగా ఏడుస్తోంది. మెట్లు దిగుతున్నారు భార్యాభర్తలు.

పనిమనిషి వాళ్ళను ఆశ్చర్యంగా చూస్తోంది. భార్యాభర్తలు ఆమె ఉనికిని కనిపెట్టనట్టు బయటకు నడిచారు. పనిమనిషి పరుగెత్తింది. గేటు తెరిచింది.

వాత్సవ కారు నడుపుతున్నాడు. కారు గేటు దాటింది.

శ్రీపతి మొక్కల చాటునుండి ఆ పనిమనిషిని పలకరించాడు.

"ఏమిటి? ఏమయింది?" అడిగాడు శ్రీపతి.

పనిమనిషి తల అడ్డంగా త్రిప్పింది.

"పరంధామయ్యను ఎవరో చంపేశారు. వాత్సవకు చెబుదామని రహస్యంగా వచ్చాను. అప్పటికే గౌరి వచ్చింది. ఆమె తట్టుకుంటుందో లేదో .... పాపం!" నిట్టూర్చాడు శ్రీపతి.

శ్రీపతి రోడ్డుమీదకు వచ్చాడు. మోటార్ సైకిలు డస్టుబిన్ చాటున పెట్టి వచ్చాడు తాను. శ్రీపతి అటు నడిచాడు. మోటార్ సైకిలు స్టార్టుచేశాడు.

నేతాజీ వీధి నెంబర్ 201 ఇంటిముందు ఆపాడు మోటార్ సైకిల్. రఘు ఇల్లు తెరచివుంది. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. ఇంటిముందు స్కూటర్ లేదు. హడావుడి లేదు. రఘు శవంవుంటే హడావుడి వుండదా? లేక రఘును ఈపాటికే మార్చ్యురీకి తీసుకుపోయారా?

పోలీసులకు అపాటి చురుకుతనమా! ఆశ్చర్యం! లేదు! ఎక్కడో తప్పింది.

శ్రీపతి మోటార్ సైకిలును వెనక్కి తిప్పాడు. వెనక ఎక్కడో పోలీస్ సైరన్ వినిపిస్తోంది. పోలీస్ వానూ, కారూ వస్తోన్నాయి.

శ్రీపతి మోటార్ సైకిలును పోనిచ్చాడు.

పోలీస్ వ్యాన్ లైట్లు అతడిమీద పడ్డాయి. శ్రీపతి ప్రక్క రోడ్‌లోంచి తన ఇంటికి చేరుకున్నాడు.

మోటారుసైకిలుకు స్టాండువేసి లోపలకు నడవబోయాడు. అతడి భుజంమీద చెయ్యి పడింది.

శ్రీపతి పరిహాసంగా నవ్వి, "రఘూ!" అన్నాడు.

10

పోలీస్ ఇన్స్పెక్టర్ విచిత్రంగా చూశాడు. కోపంతో అతడి కళ్లు ఎర్రబడ్డాయి. ఎలక్ట్రిక్ లైట్ల కాంతిలో అత్యవసర సమావేశం అది.

"ఒకే రాత్రి రెండు హత్యలు!" అరిచాడు ఇన్స్పెక్టర్.

సబ్ ఇన్స్పెక్టర్, హెడ్ కానిస్టేబులూ, సార్జంటూ, ఇతర కానిస్టేబుల్స్ సమావేశమయారు.

"సార్!" వినయంగా అన్నాడు సబ్ ఇన్స్పెక్టర్.

"వాట్!" కోపంతో వూగిపోయాడు ఇన్స్పెక్టర్.

"పరంధామయ్యను ఎవరో కత్తితో పొడిచిచంపారు. అది హత్యే! కాని శేషగిరిని ఎవరు చంపారో, ఎలా చంపారో ..."

"ఎలా చంపారు? అతడిని బార్‌లో కలిసిన వకాన్ ఎవరు?"

"సార్! బార్‌లో వర్కర్స్ చెప్పిందాన్ని బట్టి

పఠాన్ పోలికలు పరంధామయ్యలో వున్నాయి."

"అయితే?"

"పరంధామయ్యా, అతడూ ఒకప్పుడు పార్ట్‌నర్స్. ఇద్దరూ తాగారు పైగా...." సబ్ ఇన్స్‌పెక్టర్ వ్రేలిముద్రల నిపుణుడివైపు చూశాడు.

"బార్‌లో గాజు గ్లాసు మీద వ్రేలిముద్రలతో పరంధామయ్య చేతి వ్రేలిముద్రలు సరిపోల్చాం సార్. ఒక గ్లాసుమీద పరంధామయ్య వ్రేలిముద్రలున్నాయి" అన్నాడు నిపుణుడు.

"కాని పరంధామయ్య తొమ్మిది గంటలకు చనిపోయాడు. శేషగిరి పదకొండు గంటలకు సెరిబ్రల్ హెమరేజ్‌తో చచ్చిపోయాడు. పరంధామయ్యను ఎవరు హత్య చేశారు?"

"పరంధామయ్య శేషగిరిని హత్య చేశాడేమో!"

"ఎలా? రెండు గంటల తర్వాత శేషగిరి చనిపోయేటట్టు ఎలా చేయగలిగాడు?"

అందరూ ఆలోచనల్లో పడ్డారు.

"శేషగిరి గది సౌండ్ ప్రూఫ్ రూం. ఆ గదిలోనే ఏదో మర్మం వుంది. పరంధామయ్యకు ఆ గది మర్మం తెలిసివుండాలి. లేదా ఆ గదిలో శేషగిరి చనిపోయేలాగా...." ఆగాడు ఇన్స్‌పెక్టర్.

అతడి తలలో దీపం వెలిగింది.

శేషగిరి గదిలో బల్లకి తీగలు పీకివున్నాయి. తీగలు బల్లవద్ద పీకివుండటానికి కారణం ఏమిటి?

11

"శ్రీపతీ!" కోపంతో వణుకుతున్నాడు రఘు.

"రా! ఇంట్లో కూర్చుని మాట్లాడుకుందాం!" అన్నాడు

శ్రీపతి.

"ఇంట్లోకి ఎందుకు? నన్ను లోపల చంపడానికా!"

"వెర్రివాడా! చంపాలంటే ఇక్కడే చంపగలను!"

"అవును. నువ్వంత మొనగాడివే!"

శ్రీపతి అతడి చేతిని పట్టుకుని లోపలకు తీసుకు వెళ్ళాడు.

"ఏమైనా తాగుతావా?" అడిగాడు శ్రీపతి.

"విషం కలిపిందా?"

"కాదు. నేను తాగాకనే తాగు. ప్లీజ్.... కంపెనీ కోసం!"

"శ్రీపతీ! నువు మేకవన్నె పులివి! నన్ను తుపాకీతో కాల్చి చంపాలని ప్రయత్నించావు!"

"నేను కాదు! వాత్సవ!"

రఘు నిర్ఘాంతపోయాడు. "వాత్సవ! నేను అతడికి ఏం అపకారం చేశాను?"

"అతడి భార్య గౌరిమీద నువు నాలుగు సంవత్సరాల క్రితం అత్యాచారం చేశావు. పగతీర్చుకోవడానికి!"

"అయితే వాత్సవకు ఆ విషయం చెప్పి నువ్వే అతడిని పురికొల్పి నామీదకు పంపావు!"

"అవును. నిజం చెప్పడం తప్పా?" సీసాలోని ద్రవం గ్లాసులలోకి ఒంపాడు శ్రీపతి.

"నిజం! ఏమిటూ నిజం! నాలుగేళ్ళ తర్వాత నిజాలు చెప్పి కాపురాలు నాశనం చేయడమా?"

"నిజం నిప్పులాంటిది! దాచరాదు!"

"నువు అబద్ధం ఫోటోలు పెట్టుకుని ఒకనాటి నిజాలతో నాటకమాడావు!"

"అరవక! నువ్వే పరంధామయ్యను చంపావు!"

"నువ్వే నన్ను రెచ్చగొట్టి చంపించావు!"

"సాక్ష్యం లేదు!"

"నువ్వు ఈ పట్టణం లో నే వున్నావు. నన్నూ వాత్సవనూ రెచ్చగొట్టావు. నేను పరంధామయ్యను చంపాలి. వాత్సవ నన్ను చంపాలి. వాత్సవను...."

"వాత్సవకు గౌరిని గురించిన నిజం తెలిసింది. ఆత్మ హత్య చేసుకుంటాడు."

"గౌరి ఏమవుతుంది?"

"లక్షల ఆస్తితో నా పరమవుతుంది."

రఘు ఎగిరి అతడి గొంతు పట్టుకున్నాడు. శ్రీపతి గింజుకున్నాడు. రఘును విసిరికొట్టాడు శ్రీపతి. రఘు తుళ్ళి బల్లమీదపడ్డాడు. పెదిమ చిట్లింది. రక్తం ఉప్పగా తగిలింది. రఘు రెచ్చిపోయాడు. విసురుగా లేచాడు. శ్రీపతిని సమీపించాడు.

ఇద్దరూ ముష్టి యుద్ధం మొదలు పెట్టారు.

రఘు పిడికిళ్ళతో కొట్టసాగాడు.

శ్రీపతి తల పట్టుకున్నాడు. రఘు పిడికిలి బిగించి శ్రీపతి కడుపులో గుద్దాడు. శ్రీపతి వెనక్కి వంగి అతడి పిడికిలి పట్టుకుని ముందుకు లాగాడు. రఘు బోర్లగిల పడబోయాడు. శ్రీపతి అతడిని డొక్కలో తన్నాడు. రఘు నేలమీద పడిపోయాడు.

శ్రీపతి అతడిని కాలర్ పట్టి ఎత్తాడు.

రఘు చెయ్యి విసిరాడు. శ్రీపతికి దంతాలు కదిలి నట్టయింది. శ్రీపతి అతడి మెడ పట్టుకోబోయాడు. శ్రీపతిని నడుంమీద తన్నాడు రఘు. గుమ్మంలో అలికిడి కావడం అతడికి తెలియదు. అతడి మెడను ఎవరో పట్టు కున్నారు. రఘు ఆశ్చర్యంలోంచి తేరుకు నేలోగా అతడి

కంఠం నరాలు నలిగిపోతున్నాయి.

గాజులు గలగలలాడటం రఘుకు వినిపిస్తోంది.

తనను పట్టుకున్నది ఆడదా?

శ్రీపతి సోఫాలో పడ్డాడు. బలంగా వూపిరి పీల్చుకున్నాడు. రఘును ఎవరో ఆడది పట్టుకుంది. ఆమెను పరకాయించి చూశాడు.

అతడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి. ఆమె గౌరి. ఇక్కడికి ఎలా వచ్చింది?

రఘు ఆమెను బలంగా విసిరికొట్టాడు. ఆమె సోఫా మీద పడింది. కూర్చుండే రొప్పుతోంది.

"మీ ఇద్దరూ ఎందుకు కొట్టుకున్నారు?" అడిగింది గౌరి.

రఘూ శ్రీపతీ మొహాలు చూసుకున్నారు.

ఆమెకు ఏమిటి బదులివ్వడం?

"రఘూ! నువు కానీ శ్రీపతి కానీ మా నాన్నను చంపారు. అవునా?" అరుస్తోంది గౌరి.

శ్రీపతి వ్యంగ్యంగా నవ్వి "రఘు చంపాడు. అతడికి మీ నాన్నమీద కోపం!" అన్నాడు.

గౌరి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. "ఆ కోపం నువు రేకెత్తించావు" అంది.

"అవును."

"తొమ్మిది గంటలకు రఘు మా నాన్నను చంపాలి. పదిగంటలకు నేను రఘును చంపాలి. కాని పదిగంటల తర్వాత శేషగిరి ఎలా చనిపోయాడు?"

"ఆ రహస్యం ఎవరికీ తెలియదు."

గౌరి పళ్లు బిగించి, "పోలీసులకు అనుమానం వచ్చింది. మరల శేషగిరి గదిలోకి వెళ్ళారు" అంది.

"వెళ్ళనివ్వు. శేషగిరిని చంపిన శబ్దాల యంత్రం పరంధామయ్యది. అతడే శేషగిరి గదిలో ఆ యంత్రాన్ని అమర్చాడు."

"రాస్కెల్! ఇంతా చేసి చనిపోయిన మా నాన్న మీదకు త్రిప్పావన్నమాట!"

"అవును."

"నువ్వు....నువ్వు...." గౌరి వణుకుతోంది "నీకు మేము అపకారం చేయలేదు. మామీద ఎందుకు పగబట్టావు?"

"నీ అందం నా సొంతం కావాలి. నీ ఆస్తికి హక్కుదారు నేనే కావాలి!"

"కాని నువ్వు నన్నూ, రఘూనూ, మా నాన్ననూ హత్యలకు పురికొల్పావు. ఈ విషయాలు పోలీసులకు చెబుతాను."

"నేను రాత్రి తొమ్మిది గంటలవరకూ విజయవాడలో వున్నాను. ఆకాశవాణిలో నా కార్యక్రమం రికార్డింగ్ లో వున్నాను. బలమైన ఎలిబీ వుంది. స్టేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, అనౌన్సరూ సాక్ష్యం చెబుతారు!"

"ఏమని?"

"శ్రీపతి అనే పెద్దమనిషి తను కోరుకున్నట్టుగా తన పరిచయాన్ని రికార్డింగ్ చేయించుకున్నాడని."

"అంటే..శ్రీపతి పేరన ఎవరినో పంపావన్నమాట?"

"అవును. ఫోటోలోని మరో నగ్న పురుషుడిని బెదిరించి పంపాను."

రఘు ఇద్దరినీ గ్రుడ్లప్పగించి చూస్తోన్నాడు. శ్రీపతి చెబుతోంటే ఒక్కొక్క విషయమూ మెదడుకు సుత్తిపోటు లాగా తగులుతోంది. శ్రీపతిలాంటి స్వార్థపరుడి చేతిలో తాను ఎలా నలిగాడో తలుచుకుంటే ఆశ్చర్యంగావుంది.

125

గౌరి వున్నట్టుండి పకపక నవ్వింది. బ్లవుజ్ లోంచి మినీ టేప్ రికార్డర్ తీసింది. అప్పటివరకు బయట కాచుకొని వున్న పోలీసులు లోపలకు జొరబడ్డారు. క్షణాలలో శ్రీపతి, రఘు ఇద్దరి చేతులకు బేడీలుపడ్డాయి.

గౌరి టేప్ రికార్డర్ను ఇన్స్పెక్టర్కు అందించి భారంగా బయటకు నడిచింది.

—:ఐ పో యి ం ది:—